క్లుప్తంగా

మొక్కు చెల్లించుకున్న ఆది శ్రీనివాస్



మొక్కులు చెల్లించుకుంటున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం మొక్కులు చెల్లించారు. గ్రామానికి చెందిన నాయకుడు నంద్యాడపు సాగర్, ఉపసర్పంచ్ రాంరెడ్డి, యువకులు ఎన్నికల సమయంలో ఆది శ్రీనివాస్ గెలుపుకోసం ఆలయంలో మొక్కుకున్నారు. ఆదివా రం ఆయన గ్రామానికి రాగా ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని కేటీఆర్



మాట్లాడుతున్న ప్రవీణ్ జే టోని

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌కు అధికారం మీద వ్యామోహం తప్ప ప్రజలపై ప్రేమలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆరోపించారు. ఆదివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లలో కేసీఆర్ సర్కారు ఆటో డ్రైవర్ల జీవితాలను ఆగం చేసిందని మండిపడ్డారు. అధికారంలో ఉన్నపుడు ప్రజలను పట్టించుకోలేదని ఇప్పుడు ప్రజా సమస్యలపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింగం గౌడ్, రైతుసెల్ అధ్యక్షుడు పరుశురాం గౌడ్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి రాజు, జిల్లా సేవాదళ్ నాయకులు చంద్రయ్య, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు మధుకర్, జిల్లా హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు భరత్, యూత్ నాయకులు ప్రశాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లిలో ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యంతాగి వాహనాలు నడపవద్దని సూచించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ బాబు, కానిస్టేబుల్ రియాజ్, కార్తీక్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్‌కు సత్కారం



సిరిసిల్లకల్చరల్: ఆల్ సీనియర్ సిటిజన్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా శాఖ కోశాధికారి దొంత దేవదాస్‌ను హైదరాబాద్‌లో సత్కరించారు.

అన్నివిధాలా గ్రామాభివృద్ధి

కోనరావుపేట: మండలంలోని మర్తనపేట గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశానని మాజీ సర్పంచ్ జవ్వాజి తిరుపతిగౌడ్ అన్నారు. ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను సర్పంచ్‌గా పనిచేసినప్పుడు గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించి, అన్నికాలనీల్లో సీసీరోడ్లు వేయించినట్లు తెలిపారు. ప్రస్తుతం సర్పంచ్ వంశీ, వార్డుసభ్యులు కావాలనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. సర్పంచ్‌గా పనిచేస్తూ రేషన్ డీలర్‌గా ఉంటున్నాడని, రేషన్ దుకాణాన్ని నిరుపేదలకు కేటాయించాలని తాను తహసీల్దార్ కోరడం వల్లే తనపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులపై తానుచర్చకు సిద్ధమన్నారు.

సమావేశానికి తరలిన నాయకులు

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్లలో ఏర్పాటు చేసిన కరీంనగర్ పార్లమెంటరీ సన్నాహక సమావేశానికి మండలంలోని అన్నిగ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పెద్దఎత్తున తరలివెళ్లారు. ఎంపీపీ రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామశాఖ అధ్యక్షులు, కార్యకర్తలున్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం పర్యటించనున్నారు. కేశనపల్లిలో జీపీ భవనంతో ప్రారంభంతోపాటు అనంతరం జవారిపేట గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

‘కళ’తప్పిన కళామందిర్



సినారె కళామందిర్ ఆవరణలో నిలిపిన మున్సిపల్ వాహనాలు



సినారె కళామందిర్ ముందు వెలిసిన దుకాణాలు

- శిథిలావస్థకు చేరిన సినారె కళాభవన్
- పార్కింగ్‌కు అడ్డాగా మారిన వైనం
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- పట్టించుకోని అధికారులు
- అసహనం వ్యక్తంచేస్తున్న కళాకారులు

వేములవాడరూరల్: కళాకారులకు పుట్టినిల్లుగా పేరున్న వేములవాడ మండలంలో అప్పటి స్వర్గీయ మహనీయుడు డా. సి. నారాయణ రెడ్డి రూ.50 లక్షలతో కళాకారుల కోసం కళాభవనాన్ని పట్టణంలో నిర్మించారు. 2002 ఏప్రిల్ 10న ప్రారంభించిన ఈ కళాభవనం కొన్నేళ్లు సాహిత్య, సాంస్కృతిక వేదికగానే కాకుండా ఎన్నో ప్రభుత్వ, ప్రైవేట్ సమావేశాలు కూడా ఈ కళామందిర్‌లో నిర్వహించారు. తర్వాత కళాభవనాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరి ప్రస్తుతం మున్సిపల్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. ఈ భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు రూ.5కోట్లు మంజూరు చేయించారు. మాజీ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా 2022 డిసెంబర్ 20న భూమిపూజ చేశారు. కానీ ఇప్పటివరకు కాంట్రాక్టర్ పనులు ప్రారంభంకాలేదు. పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కావకవపోడంతో ఈ ప్రాంత కళాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కొన్నేళ్లుగా శిథిలావస్థకు

వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజిపేట గ్రామానికి చెందిన స్వర్గీయ డా.సి.నారాయణరెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో వేములవాడ ప్రాంతవాసిగా ఈ ప్రాంత కళాకారుల మీద ఉన్న అభిమానంతో రూ.50 లక్షలతో వేములవాడ మండల పరిషత్ ఆవరణలో సినారె కళామందిర్‌ను నిర్మించారు. వేములవాడతో పాటు సిరిసిల్ల పట్టణంలోనూ ఆయన నిధుల నుంచి నిర్మించారు. కానీ వేములవాడలోని సినారె కళామందిర్ గత కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరడంతో ఇక్కడ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. గతంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిన కళాకారులు కళామందిర్ శిథిలావస్థకు చేరడంతో కళా ప్రదర్శనలకు దూరమవుతున్నారు. ప్రతి ఎన్నికల సమయంలో కళామందిర్‌కు ప్రత్యేక నిధులు తీసుకువస్తామని చెప్పిన నాయకులు ఏళ్లు గడిచిపోయింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు కళా భవనాన్ని నూతన హంగులతో నిర్మించేందుకు రూ.5 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులకు మాజీ మంత్రి కేటీఆర్ భూమిపూజ చేశారు. అయినా ఇప్పటివరకు పనులు జరగడం లేదు. నిరుపయోగంగా ఉన్న ఈ కళామందిర్‌ను వేములవాడ మున్సిపల్ అధికారులు ఆధీనంలోకి తీసుకొని మున్సిపల్ వాహనాలను పార్కింగ్‌కు ఉపయోగించుకుంటున్నారు. వీటితో పాటు కార్యాలయ పరిసర ప్రాంతాల్లో మటన్ దుకాణాలు, ఇతర దుకాణాలను కార్యాలయం ముందు ఏర్పాటు చేయడంతో కళామందిర్ కళ తప్పినట్లయింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నాయకులు పట్టించుకొని కళామందిర్‌కు పూర్వవైభవం తీసుకురావాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పూర్వ వైభవం తీసుకురావాలి



ఈప్రాంతవాసిగా సి.నారాయణరెడ్డి వేములవాడ పట్టణంలో కళాకారుల కోసం కళాభవనం నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. కళాభవనానికి మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలి. ఈ ప్రాంత కళాకారులకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– గాజర్ల బుగ్గయ్య, కళాకారుడు, వేములవాడ

ప్రభుత్వం చొరవచూపాలి



ఈ ప్రాంతంలో ఎంతోమంది కళాకారులు కళను నమ్ముకొని బతుకుతున్నారు. అలాంటి వారి కోసం సినారె నిర్మించిన ఈ భవనం నిరుపయోగంగా మారింది. ఎప్పుడు కళాకారులతో కార్యక్రమాలు నిర్వహించే ఈ కళాభవన్ని పాలకులు పట్టించుకోవం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి కళామందిరం నిర్మించాలి.

– తీగల రాజేశం, ఒగ్గు కళాకారుడు, నూకలమర్రి

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం



పల్లె దవాఖానను ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి (వేములవాడ): ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం మండలకేంద్రంలోని రెండు పల్లె దవాఖానాలు, జెడ్పీ హైస్కూల్, ఎస్సీ హాస్టల్‌లో డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు. పంచాయతీ పాలకవర్గ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజలకు అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు నిధులు మంజూరుతో పాటు, పలు సమస్యలపై గ్రామస్తులు వినతిపత్రం అందించారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ తర్రె ప్రభలత, ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎంపీడీవో మాలోతు శంకర్, పీఆర్‌ఏఈ మనోహర్, సెస్ డైరెక్టర్ గంగారాం, డీసీసీ కార్యదర్శులు తిరుపతి, శ్రీనివాస్ రెడ్డి, లింగం, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామశాఖ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు గంగనర్సయ్య, భూమేశ్, పరందాం, వైద్యసిబ్బంది, జెడ్పీ హైస్కూల్ అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

తంగళ్లపల్లి: యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. చింతలఠాణాలో కాంగ్రెస్ నాయకుడు బస్వాపూర్ ఉపసర్పంచ్ సత్తు శ్రీనివాస్ రెడ్డి ఆద్వర్యంలో ప్రారంభించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు ట్రోఫీలు అందజేశారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ప్రదాన కార్యదర్శి రాజు, కిసాన్‌సెల్ అధ్యక్షుడు పర్శరాములు, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గడ్డం మధుకర్ (ఛోటు), ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సాయి ప్రసాద్, జిల్లా కాంగ్రెస్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు భరత్‌గౌడ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

30న మంత్రి పొన్నం పర్యటన

- మొదటిసారిగా మంత్రి హోదాలో ఎల్లారెడ్డిపేటకు
- ఏర్పాట్లు చేస్తున్న నాయకులు





మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలో ఈనెల 30న మంగళవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ రానున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య తెలిపారు. మండంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మంత్రి పర్యటన వివరాలను వెల్లడించారు. రాగట్లపల్లిలో ఉదయం 9.30గంటలకు అదనపు తరగతి గదులకు శంకుస్థాపన, 10.30 గంటలకు దుమాలలో రైతువేదిక, పాఠశాల ప్రహరీ ప్రారంభం, 11గంటలకు రాజన్నపేటలో రైతువేదికను ప్రారంభిస్తారన్నారు. అనంతరం మండల కేంద్రంలో పార్టీలో చేరికలు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపా రు. ఈ మేరకు మంత్రి పర్యటనపై వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో సమావేశమైనట్లు పేర్కొన్నారు.

మంత్రి పర్యటనకు ఏర్పాట్లు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మొదటిసారిగా మండలకేంద్రానికి రానుండటంతో పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి పొన్నంకు ఎల్లారెడ్డిపేటతో అనుబంధం ఉంది. మంత్రితో పాటు విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే. మహేందర్ రెడ్డి రానున్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, నాయకులు గిరిధర్‌రెడ్డి, బాబు, లింగంగౌడ్, తదితరులున్నారు.

మంత్రి గారు.. సాయం అందించండి

- మంత్రి పొన్నంకు బాధితుడి విజ్ఞప్తి
- ఎల్‌వోసీ అందించేందుకు హామీ



మంత్రి పొన్నంకు విన్నవిస్తున్న శంకర్

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి గ్రామానికి చెందిన వలసజీవి టేకు శంకర్ రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. కోరెంకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం కలిసి తనకు సాయం అందించాలని కోరారు. మటన్ సెంటర్ నడిపే శంకర్ కొన్నినెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. రూ.లక్షలు వెచ్చించి రెండుసార్లు ఆపరేషన్ చేసినా నయం కాలేదు. తనకు సాయం అందించి ఆదుకోవాలని శంకర్ భార్య పద్మ, పలువురు మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన మంత్రి హైదరాబాద్‌లో మెరుగైన వైద్యం అందించేందుకు ఎల్‌వోసీ ఇస్తానని హామీ ఇచ్చారు. కాగా శంకర్ దీనస్థితిపై ఈనెల 15న ‘వైకల్యమున్నా ఉపాధి తిప్పలు’ అనే శీర్శికన సాక్షిలో కథనం ప్రచురితమైంది

కార్యకర్తలకు అండగా ఉంటాం



ప్రమాదబీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త గొడిసెల దేవయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వ బీమా రూ.2లక్షల చెక్కును బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆదివారం అందజేశారు. కేటీఆర్ మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటామ న్నారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, తంగళ్లపల్లి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న పాల్గొన్నారు.

కార్మికులకు ప్రభుత్వమే వేతనాలివ్వాలి



మాట్లాడుతున్న కడారి రాములు

సిరిసిల్లటౌన్: మిషన్ భగీరథ కార్మికులకు కాంట్రాక్టర్ నుంచి కాకుండా ప్రభుత్వమే నేరుగా జీతాలు అందించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. ఆదివారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్నెళ్లుగా కార్మికులకు జీతాలు అందడం లేదని, కార్మికులకు పనిభారం తప్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు అజ్జవేణు, అన్సల్ దాస్ గణేశ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల నిర్వహణపై నిఘా

- నివేదికలు కోరిన అధికారులు
- సర్వేలు చేస్తున్న సీఆర్పీలు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో ప్రైవేటు పాఠశాలల నిర్వహణ తీరుపై నివేదికలు ఇవ్వాలని జిల్లా ఉన్నతాధికారులు కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీనిలో భాగంగా సీఆర్పీలు సర్వేలు చేసి రిపోర్టు సంబంధిత మండల విద్యాధికారులకు అందించినట్లు తెలిసింది. వేములవాడలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థిని డ్రెస్‌కోడ్ విషయం తలెత్తిన వివాదంతో పాఠశాల నిర్వహణ బాధ్యులపై కేసు నమోదైన విషయం తెలిసిందే. దీనికి నిరసనగా తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల సంఘం(ట్రస్మా) జిల్లా బాధ్యులు జిల్లాలో పాఠశాలలో బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో శనివారం కొన్ని పాఠశాలలు బంద్ పాటించాయి. ఒకరి సమస్యపై పాఠశాలలు బంద్ చేయడంపై వేములవాడకు చెందిన మోహన్ రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు బంద్ వ్యవహారంపై నివేదిక ఇవ్వాలని మండల విద్యాధికారులను ఆదేశించినట్లు సమాచారం. అధికారుల ఆదేశాలను సారం ఆయా మండల సీఆర్పీలు పాఠశాలల నిర్వాహకులకు ఫోన్ చేసి నివేదికలు సమర్పించినట్లు తెలిసింది.

హెచ్చరిస్తున్న విద్యార్థి సంఘాలు

ప్రభుత్వ అనుమతితో నిర్వహణలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టారీతిగా బంద్‌లు పాటించడం, దానిపై జిల్లా, మండల విద్యాధికారులకు సమాచారం లేకపోవడం విడ్డూరమని, అనుమానాలకు తావిస్తున్నట్లు పలువురు విద్యార్థి సంఘ నాయకులు విమర్శలు చేస్తున్నారు. జిల్లాలో ఎక్కడలేని పాఠశాలల ఆకస్మిక బంద్‌లు వేములవాడలో ఉంటున్నట్లు దీనిపై అధికారులు తగు చర్యలకు వెళ్లాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

ప్రైవేట్‌లో చదివిస్తే ఉద్యోగం నుంచి తొలగించాలి



మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ తమ పిల్లలను ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివిస్తే వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నేవూరి దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేటలో ఆదివారం ఆయన మాట్లాడారు. నిరుపేదల పిల్లలు సర్కార్ బడుల్లో చదివితే ప్రభుత్వ ఉద్యోగాలు చేసే వారి పిల్లలతోపాటు ప్రజాప్రతినిధుల పిల్లలు మాత్రం కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ విద్యాలయాలను బలోపేతం చేస్తూ అందులో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన వారు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు సర్కార్ బడులపై నమ్మకం కోల్పోయి అప్పులు చేస్తూ తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చేర్పి ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ముందు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, ప్రజాప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేర్పేలా జీవో జారీ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుపేదలకు ఆహార పదార్థాలు పంపిణీ

సిరిసిల్లకల్చరల్: పేదల కడుపు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్న ధరణి స్వచ్ఛంద సంస్థ ఆదివారం పట్టణంలోని కార్మిక ప్రాంతంలో 150 మందికి ఆహార పదార్థాలు పంపిణీ చేసింది. బుస్సా రామారావు, పద్మల మనవరాలు పుట్టినరోజు, దువ్వ లక్ష్మణ్ తమ కూతురు శుభకార్యం సందర్భంగా పద్మనాయక మినీ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. అతిథుల కోసం తయారు చేయించిన ఆహార పదార్థాలు మిగిలాయి. నిర్వాహకుల సమాచారంతో ధరణి సభ్యులు స్పందించారు. సేకరించిన ఆహార పదార్థాలను కార్మికులకు పంపిణీ చేశారు.

కుక్కల బెడద నుంచి కాపాడాలి

ఎల్లారెడ్డిపేట: కుక్కల నుంచి తమను రక్షించాలని కోరుతూ మండలంలోని బండలింగంపల్లి గ్రామస్తులు ఆదివారం పంచాయతీ అధికారులకు విన్నవించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో నెల రోజుల్లో 18 మందిపై దాడి చేశాయన్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కలను కట్టడి చేయాలంటూ ఆదివారం గ్రామ కార్యదర్శి సురేష్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పాలకవర్గం సభ్యులు సైతం జోక్యం చేసుకోవాలని కోరారు.

సర్పంచుల పదవికాలం పొడిగించాలి

ముస్తాబాద్: సర్పంచుల పదవికాలం పొడిగించాలని మండల సర్పంచులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెండింగ్ బిల్లులు రాక అప్పులు పాలయ్యామన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, వీధిలైట్లు, నీటి సరఫరా పనులను ప్రత్యేక అధికారులు చేపట్టలేరన్నారు. ఎన్నికలు నిర్వహించే వరకు అధికారుల పాలన కాకుండా సర్పంచులే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సర్పంచులు గాండ్ల సుమతి, సడిమెల సుజాత కోరారు.

ఎత్తుకు పై ఎత్తులు

- చందుర్తి సింగిల్‌విండో బల నిరూపణపై ఉత్కంఠ
- నేడు అవిశ్వాస బలపరీక్ష
- దక్కించుకునేందుకు కాంగ్రెస్..
- చేజారకుండా బీఆర్‌ఎస్ ఎత్తులు



చందుర్తి సింగిల్‌విండో కార్యాలయం

చందుర్తి: చందుర్తి సింగిల్‌విండో అధ్యక్ష పదవిపై సోమవారం నిర్వహించనున్న బలనిరూపణ ఉత్కంఠభరితంగా మారింది. సింగిల్‌విండో పరిధిలో 13 డైరెక్టర్ స్థానాలుండగా, ఎన్గల్ గ్రామ డైరెక్టర్ ఏడాదిన్నర క్రితమే మృతిచెందాడు. కాగా మిగిలిన 12 మంది డైరెక్టర్లలో తొమ్మిది మంది డైరెక్టర్ల మద్దతుతో గతనెల 23న జిల్లా సహకార సంఘ అధికారి బుద్ధనాయుడుకు అవిశ్వాస పత్రాన్ని అందజేశారు. ఈనెల17న అవిశ్వాస బలపరీక్షకు నోటీసులు జారీచేశారు. దీనిపై సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో 17న నిర్వహించే బలపరీక్షను 29న నిర్వహించాలని జిల్లా సహకార అధికారి బుద్ధనాయుడు నోటీసులు జారీచేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు చింతపంటి రామస్వామి ఎనిమిది మంది డైరెక్టర్ మద్దతుతో అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టారు. పదవిని దక్కించుకునేందుకు బీఆర్‌ఎస్ నాయకులు అవిశ్వాసానికి వెళ్లిన పార్టీకి చెందిన రమేశ్‌ను రెండ్రోజుల క్రితమే బీఆర్‌ఎస్ నాయకులు క్యాంపుకు తరలించినట్లు తెలుస్తోంది. దీంతో అవిశ్వాస బలపరీక్ష నెగ్గేందుకు కాంగ్రెస్ నాయకులు పావులు కదుపుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో బీఆర్‌ఎస్‌కు చెందిన మల్యాల డైరెక్టర్‌కు పదవి ఆశచూపుతూ మద్దతు కోరినట్లు సమాచారం. ఆరునెలలుగా పదవిపై దృష్టి సారించిన కాంగ్రెస్ నాయకులు పార్టీ అధికారంలోకి రావడంతో పదవిని చేజిక్కించుకోవడం ఖాయమని భావించారు. బీఆర్‌ఎస్ ఎత్తుగడ ఫలిస్తే అధ్యక్ష పదవి బలపరీక్ష వీగిపోతుందన్న దీమాతో ఉన్న ఆపార్టీ బలపరీక్ష సమయంలో డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటిస్తామని అంతర్గత ఒప్పందాలు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. సోమవారం జరిగే అవిశ్వాస పరీక్ష నెగ్గతుందా? వీగుతుందోనని చర్చనీయాంశంగా మారింది.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

సిరిసిల్లటౌన్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో బీవైనగర్ హనుమాన్ ఆలయంలో సత్సంగ్ కార్యక్రమాలు జరిగాయి. లలితా పారాయణం, భగవద్గీత శ్లోకాలు, మణిద్వీప పఠనం నిర్వహించారు.



పరామర్శ



వేములవాడరూరల్: మండలంలోని లింగంపల్లికి చెందిన సామ లచ్చిరెడ్డి, బొల్లారంకు చెందిన తోకల కాశయ్య ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు. సర్పంచులు లచ్చయ్య, సెస్ డైరెక్టర్ దేవరాజం, రణధీర్ రెడ్డి, మల్లేశం, పర్శరాములు, రమేశ్, తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ముస్తాబాద్: అతి వేగం ప్రమాదకరమని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై శేఖర్ కోరారు. ఆదివారం మండలకేంద్రంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.